నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం డిసెంబర్ 27, 2024 www.navatelangana.com

ప్రభుత్వ సిబ్బందిపై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-పోతంగల్

ప్రభుత్వ సిబ్బందిపై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. తహసీల్దార్ జె. మల్లయ్య వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో గురువారం తెల్లవారుజామున ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పోలీసు, రెవెన్యూ సిబ్బందితో ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన బృందం పెట్రోలింగ్ చేస్తుంది. ఈ క్రమంలో గ్రామంలో చెక్‌పోస్ట్ వద్ద (తిరుమలాపూర్ క్రాసింగ్) వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఓ టిప్పర్‌ను సిబ్బంది ఆపారు. దానిని కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్తుండగా గ్రామానికి చెందిన బజరంగ్ దత్తు అనే వ్యక్తి.. సిబ్బందిని దౌర్జన్యంగా అడ్డగించారు. టిప్పర్‌ను అక్కడి నుంచి పంపించి వేశాడు. అదే ప్రదేశంలో అక్రమ ఇసుక టిప్పర్ లోడ్ చేసిన నెంబర్ లేని జేసీబీని స్వాధీనం చేసుకుని కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. సిబ్బంది కారు వెళ్లకుండా అడ్డగించి.. ప్రభుత్వ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించి, విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ సిబ్బందిపై దౌర్జన్యం చేసిన భజరంగ్ దత్తు అనే వ్యక్తిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోటగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

కుంచె నుంచి జాలువారిన చిత్రం


సూర్యోదయం వేళ సాలూరలో ఆవిష్కృతమైన దృశ్యం

సూర్యోదయం సమయం.. చల్లని శీతాకాలం వేళ.. సూర్యుడు ఉదయిస్తున్న దృశ్యాలు ఎంతో అద్భుతంగా కనిపించాయి. గురువారం సాలూర గ్రామం మహాలక్ష్మి ఆలయం సమీపంలో నుంచి సూర్యోదయం సమయంలో సూర్యుడు ఉదయిస్తున్న దృశ్యాలు చిత్రకారుని కుంచే నుంచి జాలువారిన చిత్రంలా కనిపించాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి అద్భుతమైన దృశ్యాలతో పంటపొలాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

- చిత్రం : లింబూరి లక్ష్మణ్, బోధన్.



ఎస్ఐ, మహిళ కానిస్టేబుల్ ఆత్మహత్య

కంప్యూటర్ ఆపరేటర్ సైతం..

- గజ ఈతగాళ్లతో గాలించి మృతదేహాలు వెలికితీత
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ సింధు శర్మ
- పోలీసుశాఖలో కలకలం రేపిన ఘటన

ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్‌తో పాటు, ఓ కంప్యూటర్ ఆపరేటర్ సైతం ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం రెస్క్యూ ఆపరేషన్ ద్వారా గజ ఈతగాళ్ల సాయంతో గాలించి ముగ్గురి మృతదేహాలను బయటకు తీశారు. కాగా ఈ ముగ్గురి ఆత్మహత్య రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ముఖ్యంగా పోలీసు శాఖలో ఈ ఘటన సంచలనం సృష్టించింది.

నవతెలంగాణ-భిక్కనూర్/సదాశివనగర్/కామారెడ్డి

భిక్కనూర్ మండలంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సాయికుమార్ (31), బీబీపేట్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ శృతి(34), అదే గ్రామంలోని సొసైటీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న నిఖిల్ (28) కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఐ సాయికుమార్ సెల్‌ఫోన్ బుధవారం మధ్యాహ్నం నుంచి స్విచ్ఛాఫ్ ఉండడంతో గమనించిన ఎస్సై బంధువులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అలాగే కానిస్టేబుల్ శృతి సెల్‌ఫోన్ సాయంత్రం నుంచి స్విచ్ఛాఫ్ ఉండడంతో కామారెడ్డి జిల్లా పోలీస్‌శాఖకు సమాచారం అందించడంతో పోలీసులు ఫోన్ సిగ్నల్ ట్రేస్ చేయగా.. అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వద్ద ఉన్నట్లు గుర్తించారు. ఎస్పీ సింధు శర్మ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా.. చెరువు సమీపంలో ఎస్సై సాయికుమార్ కారు, సెల్‌ఫోన్, కానిస్టేబుల్ శృతి సెల్‌ఫోన్, మరో వ్యక్తి చెప్పులు గమనించారు. చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటారని అనుమానం వ్యక్తం చేసిన పోలీసులు.. గజ ఈతగాళ్ల సహాయంతో రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటిగంట వరకు చెరువులో గాలించి కానిస్టేబుల్ శృతి, ఆపరేటర్ నిఖిల్ మృతదేహాలను వెలికితీశారు. అర్ధరాత్రి నుంచి మరోమారు గాలించగా.. గురువారం ఉదయం 9 గంటల సమయంలో మరోచోట ఎస్సై సాయికుమార్ మృతదేహం లభించింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. 'కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా పూర్తి వివరాలు వెల్లడిస్తాం' అని ఎస్పీ సింధు శర్మ మీడియాకు తెలిపారు. ఇద్దరు పోలీస్ అధికారులు, మరో



ఎస్ సాయికుమార్, కానిస్టేబుల్ శృతి (ఫైల్)


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సింధుశర్మ

వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోవడంతో ఎస్పీ, డి.ఎస్.పి, సిఐలు, ఎస్ఐలు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపును పర్యవేక్షించారు.

ఆత్మహత్య చేసుకున్న ఎస్సై సాయికుమార్‌ది మెదక్ జిల్లా కుల్చారం మండల కేంద్రం. ఆయనకు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. భార్య ప్రస్తుతం గర్భవతిగా ఉంది. అలాగే కానిస్టేబుల్ శృతి భర్తతో విడాకులు తీసుకొని కుటుంబ సభ్యులతో గాంధారిలో నివసిస్తోంది. బీబీపేట్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తోంది. నిఖిల్‌ది బీబీపేట్ మండల కేంద్రం. ఆయన అక్కడే ఓ సొసైటీలో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఎస్సై, కానిస్టేబుల్‌కు ఉన్న సంబంధమేంటి?, కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు?, ఒకేసారి ముగ్గురు ఆత్మహత్య చేసుకోవడానికి బలమైన కారణాలేంటి? అనే కోణంలో పోలీసు ఉన్నతాధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహాలను పరిశీలించిన షబ్బీర్ అలీ..

పోలీస్ శాఖలో ఎస్, మహిళా కానిస్టేబుల్, మరో వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ ప్రభుత్వ ఆసుపత్రిలో ముగ్గురు మృతదేహాలను పరిశీలించారు. మరణానికి గల కారణాలను పోలీసుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. మరణించిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. మెదక్ జిల్లా కుల్చారంలో ఎస్సై సాయికుమార్ అంత్యక్రియలకు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.


ఎస్ఐ సాయికుమార్ మృతదేహం

ముగ్గురికీ పాతపరిచయమే..

పోలీస్ విధుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఎస్సై సాయికుమార్ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఎస్సై సాయికుమార్ మొదటగా కామారెడ్డి జిల్లా బీబీపేట్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించి అక్కడి నుంచి భిక్కనూర్‌కు బదిలీపై వెళ్లారు. కానిస్టేబుల్ శృతి, ఎస్సై సాయికుమార్, ఆపరేటర్ నిఖిల్‌కు బీబీపేట్ పోలీస్‌స్టేషన్‌లోనే పాత పరిచయం ఉందని, నిఖిల్ బీబీపేట్‌లోని సొసైటీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ.. పోలీస్‌స్టేషన్, మండలంలో కంప్యూటర్ హార్డ్‌వేర్ రిపేర్ చేస్తూ ఉంటాడని గ్రామస్తులు చెబుతున్నారు.

ఎన్నో అనుమానాలు..

అసలు ముగ్గురు మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు ఏంటనేది అందరిని తొలుస్తున్న ప్రశ్న. భిక్కనూర్ నుంచి ఉదయం 11 గంటలకు కామారెడ్డి బయల్దేరిన ఎస్సై సాయికుమార్ సాయంత్రం వరకు ఎక్కడ ఉన్నారు?, కానిస్టేబుల్ శృతి కుటుంబీకులకు ఇంటికి వస్తున్నానని చెప్పి రాకుండా సాయంత్రం సమయంలో ఫోన్ స్విచ్ ఆఫ్ పెట్టడం.. ఎస్సై, కానిస్టేబుల్‌ను నిఖిల్ ఎక్కడ కలిశాడు?, కానిస్టేబుల్ శృతి ఒంటిపై గాయాలు ఎలా అయ్యాయి?, ముగ్గురు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారా..? లేదా ఇంకేమైనా జరిగిందా? అనే ఎన్నో అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ ముగ్గురి ఆత్మహత్యకు బలమైన కారణాలు ఏంటనే కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి

- మెడికేర్ ఆస్పత్రిలో ఘటన


మృతిచెందిన శాంతమ్మ



మెడికేర్ ఆస్పత్రి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మెడికేర్ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతిచెందిన ఘటన గురువారం వెలుగు చూసింది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండలంలోని గండిమాసానిపేట గ్రామానికి చెందిన మాలకాని శాంతమ్మ (52) ఎడమ కాలు నడుము వద్ద విరిగిపోవడంతో శనివారం కుటుంబీకులు మెడికేర్ ఆసుపత్రికి తరలించారు. ఆమెకు షుగర్ ఉండటంతో దానిని కంట్రోల్ చేస్తూ.. మెడికేర్ వైద్యులు ఆరోగ్యశ్రీ అనుమతి కోసం బుధవారం వరకు ఎదురుచూసి బుధవారం మధ్యాహ్నం ఆపరేషన్ థియేటర్లోకి తీసుకువెళ్లి ఆపరేషన్ చేసేందుకు సిద్ధం కాగా.. ఆమెకు గుండె నొప్పి రావడంతో సిపిఆర్ చేస్తుండగా గుండెపై ఉన్న ఎముక విరిగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. దీంతో ఆమెను వెంటనే వైద్యులు కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎమర్జెన్సీ వార్డులోకి మార్చారు. శాంతమ్మ కుమారుడు ప్రభాకర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. అతనికి అనుమానం వచ్చి తెలిసిన వైద్యుడిని పిలిపించగా ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందిందని ఆయన చెప్పడంతో తాము ఆందోళనకు గురయ్యామని మృతుడి కొడుకు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆమెకు గుండె నొప్పి వచ్చిన సమయంలోనే తమకు చెబితే వేరే ఆసుపత్రికి తరలించి, మరో రకంగానైనా తాము అప్రమత్తమై మా అమ్మను బతికించుకునే వారిమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- చందూర్‌లో పీహెచ్‌సీ నిర్మాణానికి కలెక్టర్‌తో కలిసి శంకుస్థాపన

నవతెలంగాణ-వర్ని

పైసా ఖర్చు లేకుండా సమాజంలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం చందూర్ మండల కేంద్రంలో 1.44 లక్షలతో నిర్మాణం చేపట్టనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైద్యం, విద్య, తాగు, సాగునీరు, రవాణా, విద్యుత్తు సరఫరా వంటి వసతులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నియోజక వర్గంలో కొత్తగా చందూర్, నసురుల్లాబాద్ మండల కేంద్రాలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేసినట్టు తెలిపారు. చందూర్ మండలానికి ఏడాది క్రితమే మంజూరైనా స్థలం లేకపోవటం వల్ల ఆగిపోయిందని చెప్పారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన దాతలు చంద్రవతి, విద్యాసాగర్ దంపతులు ముందుకు వచ్చి వారి తండ్రి స్వర్గీయ సుబ్బారావు పేరిట ప్రధాన రహదారికి పక్కన విలువైన స్థలాన్ని ఇవ్వటంతో పిహెచ్‌సి నిర్మాణానికి మార్గం సుగమమైందని వివరించారు. ప్రజలకు ఉచిత వైద్యం అందించాలనే ఆలోచనతో చంద్రవతి, విద్యాసాగర్‌లు సుమారు కోటి రూపాయల విలువ చేసే స్థలాన్ని దానం చేయటంతో వారిని గజమాలతో సత్కరించారు. పిహెచ్‌సికి స్వర్గీయ సుబ్బారావు పేరు నామకరణం చేయబడుతుందని తెలిపారు. పేదలకు మరింత వైద్యం దగ్గరగా ఉండాలని పల్లెలలో పల్లెదవాఖాన, సబ్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేయటంతో బాన్సువాడలో 100 పడకల ఆసుపత్రి భవనం స్థానంలో నూతన భవన సముదాయ నిర్మాణానికి 37 కోట్లు ఖర్చు చేస్తున్నామని, మరో వంద పతకాలతో మాత శిశు ఆసుపత్రిని మంజూరు చేయించామని అన్నారు. దగ్గరలో వర్ని మండలంలో 13 కోట్లతో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి కాబోతుందని వివరించారు. దానిని కూడా ప్రారంభిస్తామన్నారు. నిజాంసాగర్ కాలువ నుంచి డిస్ట్రిబ్యూషన్ కాలువలకు రూ.200 కోట్లు ఖర్చు అయ్యిందని, చందూర్ మండల పరిధిలో నిజాంసాగర్ నీరు అందని ఆయకట్టు గ్రామాలు లక్ష్మాపూర్, కరేగాం, మేడిపల్లి గ్రామాలకు సాగునీరు అందించటానికి రూ.150 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం చేపడుతున్నట్టు వివరించారు. దీంతో 10 వేల ఎకరాలకు సాగునీరు సమాకూరుతుందని తెలిపారు. చందూర్ నుంచి లక్ష్మపూర్ గ్రామం వరకు డబుల్ రోడ్డు కూడా త్వరలో పనులు చేపట్టనున్నట్టు వివరించారు. జిల్లా కలెక్టర్ అభివృద్ధి పనులకు ఎంతో సహకరిస్తున్నారని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇండ్లకు పేద ప్రజలకు సహకరించాలని కలెక్టర్‌ను కోరారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మెస్‌ఛార్జీలను 40కి పెంచిందని తెలిపారు. మన ఊరు మన బడి పనులు చేసిన వాటి బిల్లులు రాలేదని మాజీ సర్పంచ్ కర్లం సాయరెడ్డి అయన దృష్టికి తెచ్చారు. వాటిని కూడా మంజూరు అయ్యేలా చూస్తానని అన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీఎంహెచ్‌వో రాజశ్రీ, ఈఈ శంకర్, ఎంపీడీఓ నీలావతి, ఏఎంసీ చైర్మన్ సురేష్ బాబా, వైస్ చైర్మన్ లక్ష్మణ్, పిఎసిఎస్ చైర్మన్ అశోక్ యాదవ్, మాజీ జడ్పీటీసీ అంబర్ సింగ్, మాజీ ఎంపీపీ లావణ్య రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు కర్లం సాయరెడ్డి, సత్యనారాయణ, దేవిసింగ్, రవి, మాజీ మార్కెట్ చైర్మన్ మూడ్ కవిత అంబర్ సింగ్, ఏఎంసీ డైరెక్టర్ సుధాకర్ రావు, తహసీల్దార్ శాంత, నరేందర్‌రెడ్డి, వైద్యులు, పలు గ్రామాల కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న పోచారం

టీఎస్ యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక




నవతెలంగాణ-కామారెడ్డి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీ అధ్యక్షులుగా ఆకుల బాబు, ప్రధాన కార్యదర్శిగా సాయిలును ఎన్నుకున్నారు. కోశాధికిరిగా రూప్ సింగ్, ఉపాధ్యక్షులుగా వెంకటరెడ్డి, ఏమిలియా, కార్యదర్శులుగా నారాయణ, సాయిగౌతమ్, గోపాల్, ఎం.గోపాల్, నాంపల్లి, బాలయ్య, దయాకర్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఆకుల బాబు మాట్లాడుతూ.. నో డిటెన్షన్ విధానం రద్దుతో డ్రాపౌట్స్ పెరుగుతాయని తెలిపారు. పేదలకు విద్య దూరమవుతుందని వివరించారు. బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్యకు తూట్లు పడుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు 5, 8 తరగతులకు నో డిటెన్షన్ విధానం రద్దుచేయాలన్నారు. డిటెన్షన్ విధానం తీసుకురావడం వలన విద్యార్థుల్లో డ్రాప్ అవుట్స్ పెరుగుతారని, పేదలకు విద్య దూరమయ్యే ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య హక్కు చట్టం ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్యను అందించాల్సి ఉందని, ఎనిమిదో తరగతి వరకు ఏ ఒక్క విద్యార్థి ఫెయిల్ కావడానికి విద్యను నిలుపుదల చేయకూడదని అన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేసినట్లుగా కనిపిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంబంధించిన పేద విద్యార్థులు ఇలాంటి చట్టం తీసుకురావడం వలన ఉద్దేశపూర్వకంగానే వీళ్లకు చదువు దూరం చేసే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందని అనిపిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నో డి టెన్షన్ విధానాన్ని రద్దు చేయకూడదని కోరారు. అదేవిధంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు గత 16 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించి సమ్మె విరమింప చేయాలని అన్నారు. 317 జీవో బాధిత ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై ఎస్ఎస్ఏ ఖండన

నవతెలంగాణ-కంఠేశ్వర్

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెను పిఆర్టియు అనే ఒకే సంఘానికి ఆపాదించడం బాధాకరం అని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కె రాజు, ప్రధాన కార్యదర్శి భూపేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ మహిళా అధ్యక్షురాలు-గంగామణి కోశాధికారి ప్రసాద్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మెకు రాష్ట్రంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల, అన్ని వర్గాలు సంఘీభావం, సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంలో ఎవరో మా వెనుక ఉండి సమ్మెను చేపిస్తున్నారానడటంలో వాస్తవం లేదని, గత సంవత్సరం సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరవధిక సమ్మె చేస్తున్న సందర్భంలో ఆనాటి ప్రతిపక్ష నేత టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులకు హనుమకొండ దీక్ష శిబిరంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తప్పకుండా మిమ్మల్ని రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

శనగ పంటకు ఎండు తెగుళ్లు

- రైతుల్లో ఆందోళన
- ఖాళీగా కనిపిస్తున్న పంట
- పిచికారీలు చేసినా ఆగని తెగుళ్లు

నవతెలంగాణ-మద్నూర్

ఈ ఏడాది రబీ పంట సాగులో భాగంగా ఉమ్మడి మండలంలో శనగ పంట సాగును రైతులు అత్యధికంగా వేశారు. శనగ పంటకు ఎండు తెగుళ్ల సోకడంతో ఒక్కొక్క రైతు చేనులో సగానికంటే అధికంగా ఆ పంట చేను ఖాళీగానే కనిపిస్తోంది. తెగుళ్ల నివారణ కోసం సాగు రైతులు ఎన్ని చర్యలు తీసుకున్నా.. ఎండు తెగుళ్ల నివారణ సాధ్యం కాకపోవడంతో రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. కొంతమంది రైతుల చేనుల్లో శనగ పంట బాగున్నప్పటికీ మరికొంతమంది రైతు చేనుల్లో శనగ పంటకు అత్యధికంగా ఎండు తెగుళ్ల సోకడం పంట సాగులో సగానికి పైగానే ఎండు తెగుళ్లతో పంట నష్టం జరిగింది. సాగు చేసిన శనగ పంటకు వ్యవసాయ బోరు బావుల ద్వారా నీటిని వదిలిన చేనుల్లో ఎండు తెగుళ్ల అంతంత మాత్రంగానే ఉండటంతో.. నీటి సౌకర్యం లేని శనగ పంటకు ఎండు తెగుళ్ల జోరుగా ఉందని రైతులు అంటున్నారు. ఒకపక్క ఎండు తెగుళ్ల మరోపక్క చీడపురుగుల బెడద ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈపాటికి రెండుసార్లు పిచికారీ మందులు వాడినప్పటికీ ఎండు తెగుళ్ల నివారణ సాధ్యం కాకపోవడంతో పంటకు భారీగా నష్టం కలిగింది. ఎండు తెగుళ్లపై వ్యవసాయ అధికారులను వివరణ కోరగా.. పంట మార్పిడి చేస్తేనే ఎండు తెగుళ్ల నివారణ సాధ్యమవుతుందని అధికారులు అంటున్నారు. ఏదేమైనా ఈ ఏడాది శనగ పంటకు ఎండు తెగుళ్ల బెడద అధికంగా కనిపిస్తోంది.


తెగుళ్లు సోకిన శనగ పంట

కాంగ్రెస్ మండలాధ్యక్షుడి జన్మదిన వేడుకలో ఎమ్మెల్యే



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్ జన్మదిన వేడుకలు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పాల్గొని శాలువా, పూలబొకేతో ఘనంగా సన్మానించి కేక్ కట్ చేశారు. అనంతరం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంతోష్ రెడ్డి, గిరిజన నాయకులు రతన్, మోతిలాల్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షునికి సన్మానం

- ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనక రవి



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ జిల్లా యువజన యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ పీపుల్ గౌడ్ ను ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనుక రవి కలిసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అడ్వాన్స్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జక్రాన్ పల్లి ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, గ్రామ జనరల్ సెక్రెటరీ కూడలా వినోద్, బ్రాహ్మణపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాదరి స్వామి. మాదరి దని పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి జైలు శిక్ష

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ షఫీ డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడగా గురువారం పోలీసులు షఫీని ఆర్మూర్ ద్వితీయ శ్రేణి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందని బాల్కొండ ఎస్ఐ బి.నరేష్ తెలిపారు.

మద్యం మత్తులో 100, 108కి పోన్ చేసిన వ్యక్తికి జైలుశిక్ష

నవతెలంగాణ-మెండోర

మద్యం మత్తులో డయల్ 100, 108 కు పోన్ చేసి విధులకు ఆటంకం కలించిన వ్యక్తికి ఆర్మూర్ కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు. దూదిగాం గ్రామానికి చెందిన కుంట భోజన్న మద్యం మత్తులో డయల్ 100 కు 14 సార్లు పోన్ చేయడంతో పాటు యాక్సిడెంట్ జరిగిందంటూ 108 కు పోన్ చేసి వైద్య సిబ్బంది కి , అటు పోలీసు విధులకు ఆటంకాలు కలుగజేశాడు. స్థానిక పోలీసు స్టేషన్‌లో కుంట భోజన్నపై కేసు నమోదు చేసి ఆర్మూర్ కోర్టులో సబ్మిట్ చేయగా విధులకు ఆటంకం కలిగించిన భోజన్నకు కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. అనవసరంగా విధులకు ఆటంకం కలిగించిన వారిపై శిక్షలు తప్పవని పేర్కొన్నారు. అటువంటి వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక

- ఎంపిడిఓ శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈనెల 27 న మండల స్థాయిలో ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు మం డల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ గౌడ్ గురువారం విలేకరులకు తెలిపా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీ ణ ఉపాధి హామీ చట్టం లో భాగంగా డిచపల్లి మండలములోని అన్ని గ్రామాల లో 01 ఏప్రిల్ నుండి 31 మర్చ్ 2024 వరకు జరిగిన పనులపై సామజిక తనిఖీ బృందం ఈ నెల 18 నుండి 26 వరకు సామజిక తనిఖీ నిర్వహించి నట్లు వివరించారు. సామాజిక తనిఖీ గ్రామాలలో పూర్తయిందని 27 న మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు 15వ విడత సామజిక తనిఖీ "ప్రజా వేదిక" నిర్వంహించి, సామజిక బృందం వారు గ్రామా ల వారీగా తనిఖీ నివేదిక చదివి సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్ర మానికి ఉపాధి హామీ పనులు చేసే వారు హాజరు కాగలరని అయన కోరారు. అదేవిధంగా మండలంలోని ఉపాధి హామీ సిబ్బంది, పోస్టల్ సిబ్బంది, పంచా యితీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు హాజరు కావాలని సూచించారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గంలో టీయూ నాయకులకు చోటు



ఎన్నికైన టీయూ నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ 43వ రాష్ట్ర మహాసభలు ఈనెల 23, 24, 25 తేదీల్లో సిద్దిపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జానారెడ్డి ఎన్నుకున్నారు. దానిలో భాగంగా తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థి నాయకులకు చోటు దక్కింది. రాష్ట్ర కార్య సమితి సభ్యుడిగా అమృతాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మోహన్‌ను ఎన్నుకున్నారు. దీంతో వారికి యూనివర్సిటీ ప్రొఫెసర్లు, పెద్దలు, ప్రముఖులు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అమృత చారి, మోహన్ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలపై నిరంతరం పనిచేస్తామని అన్నారు.

సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ విలీన సభను విజయవంతం చేయండి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ విలీన సభను విజయవంతం చేయాలని కోరుతూ నిజామాబాద్ రూరల్ సెక్రెటరీ జెపి గంగాధర్ అద్వర్యంలో గురువారం డిచ్ పల్లి మండల కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ విలీన సభను ఈ నెల 28న శనివారం హైదరాబాదులోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ రెండు పార్టీల విలీన సభ జరుగుతుందని తెలిపారు. జిల్లా నలుమూలల నుండి కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో రాజు, సాయిలు, రాజమణి, గంగవ్వ, మల్లయ్య పాల్గొన్నారు.

చెరువులు నింపండి

- సీఈతో మాట్లాడిన ఎమ్మెల్యే



సీఈతో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఏర్గట్ల

నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొని ఏర్గట్ల మండలకేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని గురువారం రైతులు కలిసి చెరువులు నింపిచాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే వేముల వెంటనే ఎస్సారెస్పీ సీఈ సుధాకర్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఏర్గట్ల మండలంలో కాకతీయ కెనాల్ ద్వారా నీటి విడుదల జరుగుతుంది కావున, కాకతీయ కెనాల్ నుండి డీ 18, 19, 20 డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ద్వారా వారం రోజుల్లో చెరువులు నింపాలని అన్నారు. యాసంగి వరి నాట్ల కోసం మండల రైతులకు ఈ నీరు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అందువల్ల వీలైనంత త్వరగా నీటిని విడుదలను చేయించాలని సీఈని ఆదేశించారు.

నిర్మాణాల పట్ల నిర్లక్ష్యం తగదు

- మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి



నవతెలంగాణ-ఆర్మూర్

కాంగ్రెస్ ప్రభుత్వ ఆలనాపాలనా లేక ఆలూరు బైపాస్ రోడ్డు అనాధగా మారిందని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి ఆవేద న వ్యక్తంచేశారు. ఆలూరు బైపాస్ రోడ్డు, అక్కడ నిర్మించిన హైలెవల్ బ్రిడ్జ్‌ని గురువారం జీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వాకర్లతో, స్థానిక ప్రజలతో మాట్లాడి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆలూరు బైపాస్ రోడ్డు పొడవునా కరెంటు లైట్లు పెట్టడానికి కూడా ఆర్మూర్ మునిసిపాలిటీలో డబ్బులు లేవా? అని నిలదీశా రు. అభివృద్ధి పట్ల నిబద్ధత లేని కాంగ్రెస్ సర్కారు అని ఆయన మండిపడ్డారు. గత ప్రభుత్వంలో చేపట్టిన పథకా లు, నిర్మాణాల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. తెలంగాణ ఉద్య మ సమయంలో తాను కూడా స్థానిక ప్రజలతో కలిసి ఆలూరు బైపాస్ రోడ్డు కోసం ఆందోళనలు చేపట్టామని జీవన్ రెడ్డి వివరించారు. కాగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అంకాపూర్ పర్యటన సందర్భంగా తాను చేసిన బైపాస్ రోడ్డు ఆందోళనను గుర్తు చేసి దాని కోసం అక్కడికక్కడే రూ.13కోట్లు మంజూరు చేసి భూసేకరణ కోసం ఉత్తర్వులు జారీచేశారని జీవన్ రెడ్డి వివరించారు. లోలెవల్ బ్రిడ్జ్ స్థానంలో హైలెవల్ బ్రిడ్జ్ నిర్మాణం కోసం రెండున్నర కోట్ల రూపాయలు మంజూరు చేశారన్నారు. ఆలూరు బైపాస్ రోడ్డు వల్ల 50 గ్రామాలకు కనెక్టివిటీ కలిగిందని, హైలెవల్ వంతెనతో నీటి ముప్పు తప్పిందని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాది నుంచి ఆలూరు బైపాస్ రోడ్డును నిర్లక్ష్యం చేస్తోందని, ఆలనాపాలనా కరువైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఆలూరు బైపాస్ రోడ్డు పొడవునా కరెంటు లైట్లు కూడా పెట్టకపోవడం వల్ల స్థానిక ప్రజలతో పాటు వాకర్లు కూడా ఇబ్బందులకు గురవుతున్నా రన్నారు. ఆర్మూర్ మునిసిపల్ చైర్మన్, కమిషనర్ ఇకనైనా ఆలూరు బైపాస్ రోడ్డుపై శ్రద్ధపెట్టి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని జీవన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

నందిపేట్ డబుల్ రోడ్డు పొడవునా మొక్కలు నాటాలి..

రూ. 13 కోట్ల రూపాయలతో నిర్మించిన నందిపేట్ డబుల్ రోడ్డు పొడవునా మొక్కలు నాటాలని మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. నందిపేట్ డబుల్ రోడ్డును గురువారం పరిశీలించిన జీవన్ రెడ్డి పలు సూచనలు చేయడమేకాక బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లు, కట్టిన నిర్మాణాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. నందిపేట్ డబుల్ రోడ్డు డివైడర్ పొడవునా విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని, మొక్కలు నాటి వాటి సంరక్షణ పై శ్రద్ధపెట్టాలని జీవన్ రెడ్డి కోరారు.

బిజెపి పార్టీ బ్రిటీష్ వారికంటే ప్రమాదకరం

- డిసిఎంఎస్ చైర్మెన్ తారాచంద్ నాయక్
- కులాలను మతాలను విడదీసే తత్వం వారిది
- అమిత్ షాను భర్తరఫ్ చేయాలి



అంబేద్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ధర్పల్లి

దేశానికి బిజెపి పార్టీతో బ్రిటిష్ వారికంటే ఎక్కువ ప్ర మాదం ఉందని, దేశ ప్రజలు గ్రహించాలని ఇడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్ అన్నారు. గురువారం ఆయన ఆలిండియా బంజారా సంఘం ఆధ్వర్యంలో ధర్పల్లి మండల కేంద్రములోని బంజారా సంఘంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారత రాజ్యాంగ నిర్మాత డా , బాబా సాహెబ్ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి పార్టీ అనేది దేశ ప్రజలను కులాలు, మతాలుగా విడదీసి పాలించే తత్వంగల పార్టీ అని దేశ ప్రజలు గ్రహించాలని కోరారు. భారత నిర్మాత పట్ల పార్లమెంటులో ముసాయిదా అంశాలపై చర్చ జరుగుతున్న సందర్భంలో బాబా సాహెబ్‌ను కించపరిచే విధంగా, అవమాన పరిచేవిధంగా ప్రవర్తించిన అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చెయ్యాలని డిమాండ్ చేశారు .దేశంలోని బీసీ, ఎస్సి, ఎస్టీ, అణగారిన కులాలకు, మైనారిటీలకు ఇలా చెప్పుకుంటూ పోతే ఇలా అన్నివర్గాలకు స్వతహాగా జీవించే హక్కును కల్పించిన దేవుడు లాంటి గొప్ప వేక్తిని అవమాన వేక్తి అమిత్ షా అని అందుకే అతనికి బర్తరఫ్ చెయ్యాలని యావత్ దేశప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. రాముని పేరు చెప్పి దిద్దెను ఎక్కి అడ్డగోలుగా ప్రవర్తిస్తే రానున్న రోజుల్లో బుద్ది చెపుతామని అన్నారు. రాముడు మీరొక్కరికే కాదు.. మాకు కూడా దేవుడే అని గుర్తుంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ కె యాదగిరి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంగిత్యా నాయక్, నాయకులు లాల్ సింగ్, రాజు నాయక్, తుకారాం నాయక్, విట్టల్ రాథోడ్, దత్తు నాయక్, రతన్ నాయక్, మాలావత్ రెడ్డి నాయక్, వాల్యా నాయక్, భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రింట్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-బాల్కొండ

ప్రింట్ మీడియా బాల్కొండ మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పిల్లేండ్ల శివప్రసాద్ (ఆంధ్రప్రభ), ఉపాధ్యక్షులుగా నార్ల రాజు(మన తెలంగాణ), తొగటి మురళి మోహన్ (నమస్తే తెలంగాణ), ప్రధాన కార్యదర్శిగా రాజుల రామనాథం (అక్షర విజేత), కోశాధికారిగా షాదుల్లా (లోకంతీరు), సలహాదారులుగా సిహెచ్.మల్లేష్ గౌడ్ (ఈనాడు), బొమ్మెన భూమేశ్వర్ (సాక్షి), పాపయ్యగారి స్వామి (వెలుగు), కార్యవర్గ సభ్యులుగా వరంగంటి శ్రీనివాస్ (ఆంధ్రజ్యోతి), సిరిగిరి వెంకటేష్ (ప్రజా జానహితం), షేక్ యూసుఫ్ (నవ తెలంగాణ), సయ్యద్ శంషోద్దిన్ (సమయ జ్యోతి), కట్కం శంకర్ (జనం వెలుగు) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను శాలువా,పూల మాలలతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

స్నేహ సొసైటీలో దుస్తులు, నిత్యావసర సరుకుల పంపిణీ



నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని మారుతీ నగర్‌లో గల స్నేహ సొసైటీ ఆవరణలో కావట్టి హనుమంతు యాదవ్ లీలావతి దంపతుల పెండ్లి రోజు సందర్భంగా పేద పిల్లలకు దుస్తులు, బియ్యం, పప్పులు, నూనె, కిరాణా వస్తువులు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో దుబ్బ యాదవ సంఘం అధ్యక్షులు బర్కం నారాయణ యాదవ్, ప్రధాన కార్యదర్శి మల్లేష్, యాదవ్ సలహాదారుడు నాగుల రవి, యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్లని పట్టుకున్న పోలీసులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని సంతోష్ నగర్ తాండలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం వచ్చిన వెంటనే ఎస్ఐ, సిబ్బందితో వెళ్లి పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.18,350 నగదు, 5 సెల్ ఫోన్‌లు స్వాధీనపరచుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై జి.మహేష్ తెలిపారు.

ఆలయ భూమి కబ్జాలో ఎమ్మెల్యేకు సంబంధం లేదు

- మాజీ ఎమ్మెల్సీ భర్త ఆకుల రాఘవేందర్, గడీల రాములు ప్రధాన కబ్జాదారులు
- మీడియా సమావేశంలో కాలూరు, చుట్టుపక్కల గ్రామాల పెద్దలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గ్రామపెద్దలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నల్ల పోచమ్మ మందిరం స్థల కబ్జాలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ఎలాంటి సంబంధం లేదని కాలూరు గ్రామస్తులు స్పష్టం చేశారు. గుడికి చెందిన భూమి కబ్జాకు పాల్పడిన వారిలో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత భర్త రాఘవేందర్ తో పాటు గడిల రాములు ఉన్నారని వారు ఆరోపించారు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ భర్త ఆకుల రాఘవేందర్, జిల్లా మాజీ ఒలంపిక్ అధ్యక్షులు గడీల రాములు కబ్జా చేశారని గ్రామస్తులు ఆలయం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ ఆలయ కబ్జా విషయాన్ని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన గ్రామస్తులకు అండగా నిలిచారని వెల్లడించారు. ఈ మేరకు గురువారం కాలూర్, కొండూర్ శివారులోని నల్ల పోచమ్మ మందిరం వద్ద కాలూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచులు, ఉపసర్పంచ్‌లు, గ్రామ పెద్దలు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు వెంకట్ రెడ్డి, భోజన్న లు ఆలయ భూమి కబ్జాపై మాట్లాడారు. ఆలయ భూమి కబ్జా చేసిన వారిపై చర్యల నిమిత్తం రూరల్ ఎమ్మెల్యే తమకు అండగా నిలిచారని వారు అన్నారు. ఆకుల కొండూరు గ్రామ శివారులోని సర్వే నంబర్ 199లో 12 ఎకరాల 11 గంటల వ్యవసాయ భూమి ఉన్నదని, అందులో 38 గుంటల భూమిని కొన్ని సంవత్సరాల క్రితం నల్ల పోచమ్మ ఆలయానికి కేటాయించారని తెలిపారు. ఆలయ భూమిని మాజీ డీఐజీ గంగాధర్ తమ్ముడు నీలకంఠం జీపీఏ చేసుకుని అప్పటి డిప్యూటీ ఎమ్మార్వో రంజిత్ ను తప్పుదోవ పట్టించి ఆకుల రాఘవేందర్, గడీల రాములు పేరిట చెరో 19 గుంటల భూమిని అడ్డదారిలో రిజిస్ట్రేషన్ చేయించాడని ఆరోపించారు. కేవైసీ పెండింగ్‌లో ఉండగా డిప్యూటీ ఎమ్మార్వో రంజిత్ ఏఆధారాలతో రిజిస్ట్రేషన్ చేశాడో గ్రామస్తులకు వివరించాలన్నారు. ఈ విషయమై పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికైనా ఆర్డిఓ, ఎమ్మార్వో లతో సమగ్ర విచారణ చేయించి కబ్జా కు గురైన భూమిని నల్ల పోచమ్మ ఆలయానికి అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. అధికార పార్టీ నాయకులపై చర్యల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, అగ్గు భోజన్న, మాజీ ఉపసర్పంచ్ లు నిమ్మగడ్డ శ్రీనివాసరావు, జిన్నా లచ్చారెడ్డి, మాదాస్తు పెద్ద రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారును కలిసిన వేణుగోపాల్ యాదవ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ గురువారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, (ప్రజా వ్యవహారాల) మహబూబాబాద్ మాజీ శాసనసభ్యులు వేం నరేందర్ రెడ్డిని కలిశారు. ఈ మేరకు హైదరాబాదులో వేం నరేందర్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాన్ని అందించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ యాదవ్ మాట్లాడుతూ.. తమకు రాజకీయ దిశా నిర్దేశం చూపించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత ఆప్తులు ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాల) వేం నరేందర్ రెడ్డిని కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపినట్లు వివరించారు.



సలహాదారును సన్మానించిన వేణుగోపాల్

జాతీయ సీనియర్ బేస్ బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జాతీయ సీనియర్ బేస్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా బేస్బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ తెలిపారు. ఈనెల 7 నుండి 9 వరకు జగిత్యాల జిల్లాలో జరిగిన రాష్ట్ర బేస్ బాల్ పోటీల్లో జిల్లా మహిళల జట్టు తృతీయ స్థానం పొందడంలో కీలకపాత్ర పోషించిన జిల్లా క్రీడాకారులు సుమలత, నిషా(సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాల సుద్దపల్లి) ఈనెల 26 నుండి 29 వరకు పంజాబ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ పోటీలకు ఎంపికై బయలుదేరినట్లు జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్ మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ బేస్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ శ్వేతా మేడం, ట్రెజరర్ డాక్టర్ చిన్నకృష్ణ, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, మరికంటి గంగా మోహన్, వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేష్ గౌడ్, తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల జిల్లా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నీరజా రెడ్డి, సుద్దపల్లి పాఠశాల ప్రిన్సిపల్ నళిని అకాడమీ, కోచ్ మౌనిక, వ్యాయామ ఉపాధ్యాయులు జోష్న, శ్రీలత, జిల్లా సాఫ్ట్ బాల్ కోచ్ అనికిత్ నరేష్ క్రీడాకారులను అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులు

న్యాయవాదులు ఈ ఫైలింగ్ నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న న్యాయవాదులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ బార్ అసోసియేషన్‌లో సభ్యులుగా ఉన్న జిల్లా న్యాయవాదులు ఈ ఫైలింగ్ చేసుకోవాలని బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ కోరారు. గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ఈ కోర్టు వెబ్ సైట్ లో పేరు నమోదు చేసుకుని వెబ్‌సైట్‌లోనే సివిల్ దావాలు, క్రిమినల్ కేసులలో బెయిలు దరఖాస్తులు చేసుకోవడానికి వీలు అవుతుందని ఆయన తెలిపారు. దరఖాస్తులు జిల్లా కోర్ట ఆవరణంలో ఉన్న ఇ కోర్టు సర్వీసెస్ ఆన్ లైన్ పోర్టల్‌లోనే తెలంగాణ బార్‌కౌన్సెల్ సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ (సీఓపీ) ఆధార్‌అడ్రస్ ప్రూఫ్ ఫొటోతోపాటు న్యాయవాదులు ప్రమాణం చేసి నమోదుకు అవకాశం ఉందని అన్నారు. ప్రతి న్యాయవాది ఇ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర హై కోర్టు ఆదేశం మేరకు జనవరి 15 లోగా న్యాయవాదులు తప్పక ఈ ఫైల్లింగ్ చేసుకోవాలని సూచించారు. అట్లాగే బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఆదేశం మేరకు న్యాయవాదులం దరూ డిసెంబర్ 31 లోపు సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ రెన్యువల్ సంబంధిత సర్టిఫికెట్లతో అప్లికేషన్లు బార్ కౌన్సిల్లో దరఖాస్తు చేసుకోవాలని న్యాయవాదులు అందరు తప్పక తమ వృత్తి నిర్వహణ సర్టిఫికెట్లను పొందాలని కోరారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇంటింటా సర్వే



నవతెలంగాణ-ఎడపల్లి
మండలంలోని 17 గ్రామ పంచాయతీల కార్యదర్శులతో పాటు సిబ్బంది, సంబంధిత అధికారులు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. గురువారం మండలంలోని మంగల్‌పాడ్‌లో బిల్ కలెక్టర్ పద్మావతి, సిబ్బంది శ్రీనివాస్, సంతోష్, ఆయా గ్రామాలలో గ్రామపంచాయతీ కార్యదర్శులు సర్వే నిర్వహించారు.

108ను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-తాడ్వాయి
108 సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ మధు కుమార్, కామారెడ్డి జిల్లా మేనేజర్ తిరుపతి గురువారం తెలిపారు. మండలానికి నూతనంగా 108 వాహనాన్ని ప్రభుత్వం అందించిందని, మండల ప్రజలు అత్యవసర సేవలకు వినియోగించుకోవాలని కోరారు. సిబ్బంది పంబల్ల శ్రీనివాస్, దాసి సత్యం, మిద్దె అన్వేష్ అందుబాటులో ఉంటారని తెలిపారు.

వరి సాగుపై రైతుల ఆసక్తి

- ఊపందుకున్న వరి నాట్లు
- నిండుకుండలా చెరువులు, ప్రాజెక్టులు
- జిల్లాలో రెండు లక్షల 36 ఎకరాల్లో వరి సాగు



నవతెలంగాణ-లింగంపేట్
కామారెడ్డి జిల్లాలో ఖరీఫ్ సీజన్లో వరి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే రైతులు వరినాట్లు ప్రారంభించారు. బోరు బావుల వద్ద, చెరువు ఆయకట్టు, ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో రైతులు వరి నాట్లు వేయడంలో పూర్తిగా నిమగ్నమవుతున్నారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా యాసంగి సీజన్‌లో 3,90,434 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో ముఖ్యంగా 2,40,000 ఎకరాల్లో వరి పంట, గోధుమ 1106 ఎకరాలు, జొన్న 4082, మొక్కజొన్న 43,173, పొద్దు తిరుగుడు 5706, కుసుమ 1081 ఎకరాల్లో.. అలాగే వేరుశనగ, శనగ, పెసర, మినుము, ఆముదంతో పాటు అంతర్ పంటలు సాగు చేస్తున్నారు. అయితే ప్రధానంగా జిల్లాలోని మద్నూర్, జుక్కల్, పిట్లం, బిచ్కుంద, గాంధారి, సదాశివనగర్, తాడ్వాయి మండలాల్లో అధికంగా శనగ, పెసర, మినుము, పొద్దు తిరగుడు, కుసుమ, ఆముదం, వేరుసెనగ, కంది పంటను అంతర్ పంటలుగా సాగు చేస్తున్నారు.

నిండుకుండల్లా చెరువులు ప్రాజెక్టులు..

యాసంగిలో ప్రాజెక్టుల్లో చెరువుల్లో నిండుకుండలా రైతులకు దర్శనమివ్వడంతో రైతులు వరి పంట సాగుపైనే ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పోచారం ప్రాజెక్టు కింద ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్ మండలాల్లో 12 వేల ఎకరాల్లో వరి సాగు అవుతుందని అధికారులు అంచనా వేశారు. కౌలాస్‌నాలా ప్రాజెక్టు కింద 9 వేల ఎకరాలు, నిజాంసాగర్‌లో 17 టి.ఎం.సిల నీటిమట్టం నిల్వ ఉండడంతో ఆయకట్టు కింద ఒక లక్ష 25 వేల ఎకరాల్లో వరి పంట సాగు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత 15 రోజులుగా రైతులు వారు నాట్లు వేస్తున్నారు.

వరి సాగుపై రైతుల ఆసక్తి..

రైతులు యాసంగిలో వరి పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రాజెక్టుల్లో చెరువుల్లో కుంటల్లో నీరు పుష్కలంగా ఉండడంతో బోరు బావుల్లో నీరు అధికంగా ఉండడంతో రైతులు వరి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా ఎల్లారెడ్డి, లింగంపేట్, నాగిరెడ్డిపేట్, నిజాంసాగర్, బాన్సువాడ, నసురుల్లాబాద్, బీర్కూర్, రామారెడ్డి, రాజంపేట్, మాచారెడ్డి మండలాల్లో రైతులు వరి నాటు వేస్తున్నారు. ప్రస్తుతం వరి నాట్లు ప్రారంభమవగా.. 50 శాతం వరి నాట్లు ప్రారంభమయ్యాయి.





బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)
ఎల్లారెడ్డి మండలంలోని మౌలాణఖేడ్ గ్రామానికి చెందిన గ్రామ కమిటీ అధ్యక్షులు పోచయ్య అనారోగ్యంతో ఎల్లారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కురుమ సాయిబాబా విషయం తెలుసుకొని ఎల్లారెడ్డి నాగేశ్వరావు హాస్పిటల్‌కు వెళ్లి వారిని పరామర్శించారు. అదేవిధంగా లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ భర్త ఆసుపత్రిలో చికిత్స పొందడంతో ఆయనను పరామర్శించారు. వారికి భరోసా కల్పించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)
ఎల్లారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన సయ్యద్ సలీం గుండెపోటుతో మరణించడంతో విషయం తెలుసుకున్న మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ గురువారం మృతుడి సయ్యద్ సలీం ఇంటికి వెళ్ళి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అధైర్య పడోద్దు.. ధైర్యంగా ఉంటామని హామీనిచ్చారు. మత్తమాల గ్రామానికి చెందిన సిఎస్ఐ చర్చి కమిటీ సభ్యుల మున్సిపల్ మాజీ చైర్మన్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయనతో పాటు మాజీ జెడ్పిటిసి సామెల్, తిమ్మారెడ్డి మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ షెకావత్ అలీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ ఆరిఫ్, అఫీస్ పటేల్ తదితరులున్నారు.

ఉద్యోగ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయురాలికి సన్మానం


ప్రధానోపాధ్యాయురాలిని సన్మానించిన పలువురు

నవతెలంగాణ-బోధన్
బోధన్ పట్టణంలోని బస్వతరక నగర్ కాలనీలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న జ్యోతి గురువారం ఉద్యోగ విరమణ చేయడంతో పాఠశాల ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్త సనా పటేల్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సనా పటేల్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయురాలుగా జ్యోతి పాఠశాలకు ఎన్నో సేవలు అందించారని అన్నారు.

ఘనంగా అయ్యప్ప మండల పూజ మహోత్సవం


పూజలో పాల్గొన్న భక్తులు

నవతెలంగాణ-బోధన్
బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం అయ్యప్ప మాలధారులు మండల పూజా మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు, అయ్యప్ప ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ సంతోష్ శర్మ, శివాలయం ప్రధాన అర్చకులు గణేష్, మహారాజ్ మంత్రోచ్చారణల మధ్య ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుప్రభాత సేవ, అభిషేకం, సహస్ర నామార్చన, గణపతి హోమం, విశిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జగ్జీవన్ గురుస్వామిచే సి.నారాయణ, వి.రాజేష్, టి.సాయిలు గురుస్వాముల 18 సంవత్సరం శబరిమల యాత్రను పురస్కరించుకొని వారికి రుషితుల్య పూజ, దండ ప్రదానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం అయ్యప్ప స్వాములకు, భక్తులకు 27 మంది దాతలు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం కన్నుల పండువగా అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించారు. అనంతరం స్వాములకు శాస్త్ర పితి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా ట్రస్ట్ అధ్యక్షులు శివన్నారాయణ, కార్యదర్శి ఐ.ఆర్.చక్రవర్తి, కోశాధికారి కొయ్యాడ శ్రీనివాస్ గౌడ్, గురు స్వాములు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి పశువుల కాపరి మృతి


మృతి చెందిన రాజు

నవతెలంగాణ-రెంజల్
మండల కేంద్రమైన రెంజల్ పెద్ద చెరువులో ప్రమాదవశాత్తు కాలుజారి తూర్పు రాజు (40) అనే పశువుల కాపరి పడి మృతి చెందినట్టు ఎస్ఐ ఈ.సాయన్న తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పశువులను చెరువు సమీపంలో తీసుకువెళ్లగా రాజు ప్రమాదవశాత్తు అతని కాలు జారి చెరువులో నీటమునిగి మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే కుటుంబీకులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి వెళ్లి గాలించినా.. రాజు శవం దొరకలేదు. అనంతరం స్థానిక జాలర్ల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. భార్య రూప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు డీఎస్పి ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్ష

నవతెలంగాణ-కామారెడ్డి
బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీలకు ఉచిత విద్యా, వైద్యం అందించాలని కోరుతూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో డిఎస్పీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించనున్నట్టు డి.ఎస్.పి రాష్ట్ర కార్యదర్శి సుమన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాధికార సాధన జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్షలు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మణ్ మహారాజ్, జిల్లా కన్వీనర్ బోలెశ్వర్, జిల్లా కో కన్వీనర్ రాజు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమం

- సీపీఐ ఆవిర్భావ దినోత్సవం


కామారెడ్డి :పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి/పొతంగల్
ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతరం ఉద్యమాలు చేస్తుందని సిపిఐ రాష్ట్ర సీనియర్ నాయకులు, ప్రముఖ న్యాయవాది వీఎల్ నరసింహారెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా కార్యాలయం ముందు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో కమ్యూనిస్టు పార్టీ పుట్టిందని ఇప్పటికీ వంద సంవత్సరాలోకి అడుగు పెట్టిందని, వంద సంవత్సరాలు చరిత్ర కేవలం కమ్యూనిస్టు పార్టీకే ఉందని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అనేకమంది, 4000పైగా కమ్యూనిస్టు నాయకులు అమరులయ్యారని, కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో లక్షలాది ఎకరాలు భూ పంపిణీ చేసిన ఘటన కమ్యూనిస్టులదని తెలిపారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేట్ రంగం వైపు చూస్తున్నారని ఆయన అన్నారు. బ్యాంకింగ్, ఎల్ఐసి, సింగరేణి, విమానరంగం, రవాణా రంగం, వైద్యరంగం నిరుపేదల ఉపయోగపడే రంగాలన్నీ అంబానీ, ఆదానీకి అప్పజెప్పుతున్నారని తెలిపారు. లక్షలాది కోట్ల అప్పులు చేసి భారతదేశాన్ని దోచుకుంటున్నారని, నల్లధనాన్ని తీసుకురాక నోట్లు రద్దుతో ప్రజలను మధ్యతరగతి నిరుపేదలను మరి నిరుపేదలుగా కేంద్ర ప్రభుత్వం విధానాలు తీసుకొచ్చిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేక అనేకమంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక ప్రైవేటు సెక్టార్లలో పనిచేస్తున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధానాలు మార్చుకోకుంటే భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఈ సంవత్సరం పాటు గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు గ్రామగ్రామాన మండలంలో సిపిఐ జెండా ఆవిష్కరణ చేస్తామని, ప్రజా సమస్యలపైన ఉద్యమం ఉంటుందన్నారు. ఒకపక్క రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరం అవుతున్నా వారు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదని, నిత్యావసర వస్తువులు ఆకాశం అంటుతున్నాయన్నారు. వెంటనే సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కార్యదర్శి ఎల్.దశరథ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.బాలరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.దేవయ్య, ఎం.రాజమణి, బత్తుల ఈశ్వర్, ఎం.మల్లేష్, జిల్లా నాయకులు పెద్ద హైదర్, హనుమాన్లు, సాయిలు, స్వామి, జంపయ్య, హైదర్, షకీల్, అజ్మత్, అశోక్, రాజిరెడ్డి, ఏం లక్ష్మణ్, బీరయ్య, ఆర్ లక్ష్మణ్, రాజు, పెంటయ్య, సిపిఐ జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ శత జయంతి ఉత్సవాలు...

పోతంగల్,కోటగిరి : కోటగిరి మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) శత జయంతి ఉత్సవాలను గురువారం నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ సీపీఐ జెండాను ఎగురవేశారు. అనంతరం సీపీఐ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాస్ రాములు మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటినా పునర్విభజన చట్టంలో పేర్కొన్న హామీలను కేంద్రం అమలు చేయడం లేదన్నారు. రైతులు, కూలీలు, కార్మికుల కోసం ఉద్యమించిన ఘన చరిత్ర సీపీఐ పార్టీదని విఠల్ గౌడ్ అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు బి.రాజు, బుడాల రాములు, శివరాజు, ఎస్.శంకర్, హనుమాన్లు, ఇమ్రాన్, నారాయణ, సాయిలు, హర్షద్, తదితరులు పాల్గొన్నారు.

ఏకచక్రేశ్వర ఆలయంలో అదనపు గదుల భవన నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న పలువురు

నవతెలంగాణ-బోధన్ టౌన్
పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయ అదనపు గదుల భవన నిర్మాణ పనులకు గురువారం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, బోధన్ పట్టణ అభివృద్ధి కమిటీ చైర్మన్ గంగాధర్ పట్వారీ, సెక్రటరీ బీర్కూర్ బుజ్జి, ఆలయ కమిటీ డైరెకర్లు, పట్టణ పెద్దలతో కలసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ హరి కాంత్ చారి మాట్లాడుతూ.. ఆలయం ఆవరణలో దక్షణ దిశలో ఉన్న ఆలయ అభివృద్ధి కమిటీ ఆఫీస్, ఆల యు కార్యనిర్వహణ అధికారి ఆఫీస్ గది, పూజ సామగ్రి దుకాణం గది, భక్తుల విడిది గదులు మొత్తం 20 వరకు ఉండగా, వీటి పునాదులు వద్ద మట్టి కొట్టుకుపోయి పిల్లర్లు తేలడంతో ఆలయ భవనాలు పది కాలాల పాటు చెక్కు చెదరకుండా పునాదులు మరింత పటిష్టం చేస్తున్నామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహరిస్తున్న స్థానిక ఎమ్మెల్యే మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి, ప్రజాప్రతినిధులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో భవిష్యత్తులో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు చేపట్టే అభివృద్ధి పనులకు అన్ని విధాలా సహకారం అందించాలని చైర్మెన్ కోరారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు లక్ష్మన్ యాదవ్, కమల భూమేష్, సూర లింగం, పట్టణ పెద్దలు గుండేటి శంకర్, గమర శ్రీనివాస్, ఆలయ పూజారి శివకుమార్ పాల్గొన్నారు.

నగ్లూర్ గ్రామానికి తాగునీరు అందించాలి

- ఎమ్మెల్యేను కలిసిన నగ్లూర్ కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-గాంధారి
మండలంలోని నగ్లూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మదన్ మోహన్‌ను కలిసి సిద్ధాపూర్ రిజర్వాయర్ నుంచి నగ్లూర్ గ్రామానికి సాగునీరు, తాగునీరు అందించాలని పార్టీనాయకులు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అధికారులతో మాట్లాడి తాగునీరు, సాగునీరు వచ్చే విధంగా కృషి చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మండల బీసీ సెల్ అధ్యక్షుడు జయరాజ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజు, పార్టీ సీనియర్ నాయకులు ఇస్తారి రవి, నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

నిరుపేద కుటుంబానికి 25 కిలోల బియ్యం, నగదు అందజేత


ఆర్థిక సాయం చేస్తున్న బీజేపీ నాయకుడు

నవతెలంగాణ-ఎడపల్లి
మండలంలోని పోచారం గ్రామంలో తల్లిదండ్రులు లేని మరాఠీ పూర్ణిమ అనే అమ్మాయి వివాహం శుక్రవారం ఉన్నందున నిరుపేద అమ్మాయికి వివాహం కోసం 25 కిలోల బియ్యం, రూ.3వేల నగుదును ఎడపల్లి బీజేపీ మండల సీనియర్ నాయకులు కందగట్ల రాంచందర్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్, ఎడపల్లి బీజేపీ మండలాధ్యక్షులు కోల ఇంద్రకరణ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ మండల అధ్యక్షులు


కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-రామారెడ్డి
బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రంగు రవీందర్‌గౌడ్ బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో గురువారం చేరారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు కల్వకుంట్ల మదన్మోహన్‌రావు ఆయనకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్ గౌడ్, అంబాయి ప్రసాద్, శీల సాగర్, జెసిబి శేఖర్, గోవింద్ నాయక్, అరవింద్ గౌడ్ తదితరులున్నారు.

29న నేతాజీ యూత్ ఎన్నికలు

నవతెలంగాణ-తాడ్వాయి
మండల కేంద్రంలో 29న నేతాజీ యూత్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు ఉపాధ్యక్షులు ముదాం దత్తు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు యూత్ సభ్యులు ఆదివారం ఉదయం 9 గంటలకు జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో జరిగే సమావేశానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

నవతెలంగాణ-ఆర్మూర్



రోజురోజుకు రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకై ప్రత్యేక శ్రద్ధ చూపాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి కూరపాటి అరుణ జ్యోతి అన్నారు.. ఇటీవల బాధ్యతలు చేపట్టిన పట్టణ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షురాలు సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించిన అర్బన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



సుభాష్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరైనారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో వివిధ అనారోగ్యంతో బాధపడ్డ కుటుంబాలకు ఆర్థిక భరోసా కోసం సీఎం సహానిధి ద్వారా 132 మంది లబ్దిదారులకు రూ.30,50,600 సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

అప్పుల పాలైన వారికి ఊరట

- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



చెక్కులు అందజేస్తున్న షబ్బీర్‌అలీ

నవతెలంగాణ-కామారెడ్డి

అనారోగ్యంతో అప్పులపాలైన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులతో కొంత ఊరట లభిస్తుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. గురువారం కామారెడ్డి పట్టణంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) 26 చెక్కులను దాదాపు 16 లక్షల రూపాయలు లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న సిఎంఆర్ఎఫ్ ఫైళ్లను ముఖ్యమంత్రితో మాట్లాడి కామారెడ్డి నియోజకవర్గంలో గురువారం దాదాపు 26 మందికి సీఎం సహాయ నిధి నుంచి నిధులు మంజూరు చేయించినట్టు తెలిపారు. అనారోగ్యంతో అప్పుల పాలైన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంతో కొంత ఊరట కలిగిస్తాయని తెలిపారు. పేదలకు సహాయంగా అండగా నియోజకవర్గం ప్రజల మంచి మాత్రమే కోరుకుంటామన్నారు. ఎల్ఓసి సరైన సమయంలో అందక ఎంతోమంది సరైన పత్రాలు సమయానికి అందక ఇబ్బంది పడుతున్నారన్నారు. సమగ్ర సర్వే అనంతరం డిజిటల్ హెల్త్ కార్డు అందించి 10 లక్షల వరకు నిమ్స్ ఆస్పత్రిలో ఉచిత వైద్యం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మోహన్ రెడ్డి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మహమ్మద్ అలీ షబ్బీర్..

కామారెడ్డి పట్టణంలోని సైలని బాబా కాలనీలో కాంగ్రెస్ కార్యకర్త సోదరుడు గుండెపోటుతో సౌదీలో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మృతదేహాన్ని గల్ఫ్ దేశం నుంచి అధికారులతో మాట్లాడి స్వదేశానికి తీసుకువచ్చినట్టు తెలిపారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.

మద్యానికి బానిసై వ్యక్తి మృతి



నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి మద్యానికి బానిసై రోడ్డుపై పడి మృతి చెందాడని మూడవ పోలీస్ స్టేషన్ ఇన్చార్జి ఎస్ఐ హరిబాబు గురువారం తెలిపారు. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామానికి చెందిన మాగిడి కృష్ణ కొంతకాలంగా మధ్యానికి బానిస అయ్యి ఎక్కడపడితే అక్కడ మద్యం తాగి పడిపోయేవాడు. ఈనెల 24న కృష్ణ బోర్ రిపేర్ చేస్తానని చెప్పి తన ఇంట్లో నుండి బయలుదేరి తిరిగి వెళ్లలేదు. గురువారం కృష్ణ నిజామాబాద్‌లో గల లలితా మహల్ థియేటర్ పక్కన గల అక్షిత పకోడ్ షాప్ ముందు పడి చనిపోయి ఉన్నాడు. ఆయన బంధువులకి తెలుపగా వారు అక్కడికి వచ్చారు. అనంతరం కృష్ణ మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి కృష్ణ భార్య భాగ్య తన భర్త అధిక మద్యం తాగి చనిపోయాడని మూడవ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

నవతెలంగాణ-ముప్కాల్



బుధవారం తెల్లవారు జామున బీహార్ రాష్ట్రానికి చెందిన చందర్ రుషికేషి (67) ముప్కాల్ బైపాస్ రోడ్డు జాతీయ రహదారి-44పై రోడ్డు దాటుతుండగా నిర్మల్ వైపు నుండి ఆర్మూర్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ప్రమాదం సంభవించింది. విషయం తెలుసు కున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది అంబులెన్స్‌లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి ప్రథమ చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు రెండు నెలల క్రితం కూలీ పని నిమిత్తం ముప్కాల్‌కు వచ్చి జీవనం సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడి కొడుకు నీరజ్ రుషికేషి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.రజినీకాంత్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఆర్మూర్


మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన ఓ యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. స్థానిక స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మండల దేవేంద్ర (20) ఈనెల 24న ఇంట్లో గుర్తుతెలియని ఫెస్టిసైడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గుర్తించి హుటాహుటిన జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.. కాగా చికిత్స పొందుతూ గురువారం ఆయన మరణించాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ సిహెచ్‌ఓ తెలిపారు.

జోరుగా మొరం దందా

- రాత్రి 9 అయితే చాలు తరలింపు షురూ..
- అతివేగంతో బెంబేలెత్తిపోతున్న వాహనదారులు

నవతెలంగాణ-మోపాల్

గత కొన్ని రోజుల నుండి కొందరు రాత్రి 9 దాటితే జోరుగా మొరం దందాని కొనసాగిస్తున్నారు. మోపాల్ నుండి నిజామాబాద్ వెళ్లే దారిలో ఎవరైనా టు వీలర్, ఇతర చిన్న వాహనాలపైన ప్రజలు వెళ్లాలంటే బెంబేలెత్తిపోతున్నారు. పరిమితికి మించిన వేగంతో ట్రిప్పర్స్ ఎదురుగా వచ్చిన వాహనాలకు సైడ్ ఇవ్వకుండా అతివేగంగా వెళ్తున్నాయి. అక్కడే పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు కూడా చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. కొన్ని నెలల నుండి మోపాల్ మండల కేంద్రం మొరం, మట్టి తరలింపుకు అడ్డగా మారింది. ఎంత సంపాదించుకుంటే అంతా అన్న రీతిలో కొందరు అక్రమార్కులు తమ దందాను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్ సిబ్బంది తెలిసినా కూడా చోద్యం చూస్తున్నారు. మైనింగ్ అధికారుల తీరు మరోరకంగా ఉంది. టిప్పర్ మొరం అక్రమంగా తరలిస్తున్న దానిని పట్టుకుంటే కేవలం నామమాత్రంగా 2000 రూపాయల ఫైన్ వేసి వదిలిపెడుతున్నారు. అంటే ఈ అక్రమ రవాణా పోలీసు వ్యవస్థ రెవెన్యూ వ్యవస్థ, మైనింగ్ వ్యవస్థ ఈ ముగ్గురి కనుసన్న లోనే నడుస్తుందా మరి ఎందుకు దీనిని కట్టడం చేయలేకపోతున్నారనీ మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాత్రయితే చాలు ఆ రోడ్లపైకి వెళ్లాలంటేనే ముఖ్యంగా టు వీలర్ పైన వెళ్లే వారికైతే నరకయాతన కనిపిస్తుంది. కాసుల కోసం ప్రజల జీవితాలతో చెలగాటలాడుతున్నారు. జిల్లా కేంద్రానికి కూత వేట దూరంలో ఉన్న దాన్ని అధికారులు పట్టించుకోలేకపోతున్నారు. ఇక మిగతా మండలాల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పటికైనా అధికారులు నిద్రమత్తు వీడి ప్రజల ప్రాణాలు కాపాడుతూ ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని, చట్టానికి లోబడి ప్రభుత్వ అధికారులు పని చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు... ఇది కట్టడి చేయకపోతే రాత్రి సమయంలోనే రోడ్డుపైనే ధర్నా చేయడానికి కూడా ప్రజలు సిద్ధంగా ఉన్నారు. అప్పుడు డైరెక్ట్ గా ఉన్నత అధికారులు వచ్చి ఈ సమస్యకు పరిష్కారం మార్గం సుగమం చేస్తారని మండల ప్రజలనుకుంటున్నారు



మొరం తరలిస్తున్న టిప్పర్

మావో ఆలోచనా విధానాన్ని కొనసాగిద్దాం



నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మావో ఆలోచనా విధానాన్ని కొనసాగిద్దామని బి.భాస్కర్ (సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ) నిజామాబాద్ జిల్లా కార్యదర్శి అన్నారు. గురువారం సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాగరంలో మార్క్సిస్టు మాహోపాధ్యాయులు కామ్రేడ్ మావో జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బి.భాస్కర్ మాట్లాడుతూ.. జనచైనానేత మావో చైనాలో విప్లవాన్ని విజయవంతం చేశాడన్నారు. కామ్రేడ్ మావో, అతివాద, మితవాదనికి వ్యతిరేకంగా పోరాడాడని తెలిపారు. సామ్రాజ్యవాదానికి, భూస్వాములకు, దళారీ నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ఎర్రసైన్యాన్ని ఏర్పాటు చేసి చైనాదేశంలో విప్లవం జయప్రదం చేశాడన్నారు. చైనాదేశ పరిస్థితులు, భారతదేశ పరిస్థితులకు దగ్గరపోలిక ఉందన్నారు. కామ్రేడ్ మావోఆలోచనా విధానం ద్వారా దేశంలో ప్రతిఘటన పోరాటాలు నిర్మించాలని సూచించారు. రివిజనిజానికి, వ్యతిరేకంగా విప్లవకారులు దడంగా నిలబడాలని పిలుపుఇచ్చారు. నక్సల్బరి, శ్రీకాకుళం, గోదావరి లోయ ప్రతిఘటన పోరాటల స్ఫూర్తితో దేశంలో విప్లవం కోసం పార్టీ శ్రేణులు కషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వరదయ్య, అల్తాప్, గంగాధర్ సతీష్, లత, సుమలత పాల్గొన్నారు.

మేరు సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మేరు సంఘం భవనంలో మేరు సంఘం నూతన సంవత్సర 2025 క్యాలెండర్ ను ముఖ్య సలహాదారులు కొట్టూరు సుదర్శన్, రాజుల దేవి వసంత్, పోల్కం నారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగిందని అధ్యక్షుడు రాజుల దేవి రవినాథ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేరు కులస్తుల అందరి సహకారంతో ఐదు సంవత్సరాల నుంచి ప్రతి ఏడాది నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దీకొండ లక్ష్మణ్, కోశాధికారి సంగ్వి గంగాధర్ మేరు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సిపిఐ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా ర్యాలీ, సభ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత జయంతి ఉత్సవాలలో భాగంగా స్థానిక శ్రద్ధాంజలి గంజ్ ప్రధాన ద్వారం నుంచి ర్యాలీగా అంబేద్కర్ కాలనీ రైస్ మిల్ హమాలి యూనియన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. హమాలీ కార్యాలయం ముందు గల సిపిఐ జెండాను సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభకు వై.ఓమయ్య అధ్యక్షత వహించారు. సిపిఐ సీనియర్ నాయకులైన మంద వెంకటేశ్వర్లు, పి.ముత్యాలు, బొంబాయి గంగారంలకు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ నగర కార్యదర్శి వై.ఓమయ్యలు మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించి దేశానికి సంపూర్ణస్వాతంత్రం కావాలని పోరాటం నిర్వహించారన్నారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రధాని మోడీ చరిష్మా పోయిందని కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ సామాన్య ప్రజలపై రోజు రోజు భారాలు మోపుతున్నారని తెలిపారు. నిత్యవసర వస్తువుల ధరలు నియంత్రణ కోసం ఐక్య పోరాటాల అవసరమని సిపిఐ వందేళ్ళ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు బి రఘురాం, అంజలి, రంజిత్, ఇమ్రాన్ అలీ, సఖి.సురేష్, భాను, పరశురాం, హైమది, కవిత, దేవేందర్, హనుమాన్లు, సంపత్, సాయిలు, సాయమ్మ, అమర్ పాల్గొన్నారు.

సిపిఐ జెండా ఆవిష్కరణ



పార్టీ జెండా ఎగురవేసిన నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

1925 డిసెంబర్ 26న భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆవిర్భవించి నేటికీ 100 సంవత్సరాలు అవుతుందనీ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆరెపల్లి సాయిలు అన్నారు. గురువారం పట్టణంలోనీ అంబేద్కర్ చౌరస్తాలో నూతనంగా నిర్మించిన సిపిఐ జెండా గద్దెను ప్రారంభించి జెండా ఎగురావేసిన అనంతరం అయన మాట్లాడారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ సిపిఐ నాయకత్వాన జరిగిన దేశ స్వతంత్ర ఉద్యమంతో పాటు తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిందని, నాడు ఎందరో సిపిఐ అగ్ర నాయకులు. బ్రిటిష్ ప్రభుత్వానికి ఎదురొడ్డి ఎన్నో ప్రజా పోరాటాలు నిర్వహించారని అన్నారు. తెలంగాణా రాష్ట్ర సాయుధ పోరాటంలో బాంచెన్ నీ కాళ్ళు మొక్కుతా అన్నా నిరుపేదను చైతన్య పరిచి 4500 మంది కమ్యూనిస్టు నాయకులు ప్రాణత్యాగాలు చేసి సెంటు భూమి తీసుకోకుండా.10 లక్షల ఎకరాల భూమిని పేద రైతులకు పంచిన ఘనత సిపిఐ పార్టీకే దక్కుతుందని తెలిపారు. కానీ భూర్జువ పార్టీలు ఆచరణలో సాధ్యపడని, మోసపూరిత వాగ్దానాలు చేసి ఎన్నికలు అంటే డబ్బులు, బీరు, బిర్యానీలు పంచుతూ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కిన రంగు రంగుల జెండాలు రాజ్యమేలుతున్నాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో. మౌలానా. శ్రీకాంత్. పేరోజ్, రహీమ్, నరేష్, శ్రీను, మంగ, బక్కన్న, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు

ఉచిత కృత్రిమ కాళ్ల పంపిణీ

- రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో

నవతెలంగాణ-కంఠేశ్వర్



కృత్రిమకాళ్లతో పలువురు బాధితులు

స్థానిక బర్కత్‌పురాలోగల రోటరీ కృత్రిమ అవయవ కేంద్రం ద్వారా రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్, నిజామాబాద్ రోటరీ సర్వీస్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత కృత్రిమ జైపూర్ ఫుట్ పంపిణీ ఏర్పాటు చేసినట్టు అధ్యక్షులు బిరెల్లి విజయరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ రోటరీ క్లబ్ నిజామాబాద్ మాజీ అధ్యక్షులు ఇంగు రాజేశ్వర్ హాజరై మాట్లాడారు. ఈ కృత్రిమ జైపూర్ ఫుట్ ద్వారా తిరిగి బాధితుడు ఆత్మవిశ్వాసాన్ని పొంది జీవనం కొనసాగించడానికి ఒక అవకాశం ఏర్పాటు చేస్తున్నందుకు అభినందనలు తెలిపారు. ఈ కేంద్రం తెలంగాణలో ఉన్న కొద్ది వాటిలో ఒకటని, ఇప్పటివరకు అనేకమందికి కృత్రిమ కాళ్ళను అందజేశామని అన్నారు. ఈ కార్యక్రమానికి ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ 2024-25 కార్యవర్గ సభ్యులు అలాగే జైన్ సమాజ్ మహిళా శాఖ నిజామాబాద్ వారు రుణ సహకారం కూడా అందించారని తెలిపారు. కార్యక్రమంలో మోకాళ్ళ కింది వరకు పోయినటువంటి బాధితులకు 32 మందికి కృత్రిమ జైపూర్ ఫుట్ అందజేయగా ఆరుగురికి రిపేర్లు చేసి ఇచ్చినట్టు చెప్పారు. మిగతా కొలతలు తీసుకున్న మోకాళ్ళ పైభాగం ఉన్న బాధితులకు రానున్న రోజులలో ఫోన్ ద్వారా సందేశం అందించి తిరిగి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు కార్య నిర్వహణ అధికారి లింబ్ సెంటర్ చైర్మన్ శ్రీరామ్ సోనీ, క్లబ్ కార్యదర్శి గంగారెడ్డి, ట్రస్టు చైర్మన్ ప్రకాష్ మిట్టల్, ట్రస్ట్ కార్యదర్శి జితేంద్ర మలాని, కోశాధికారి జ్ఞాన ప్రకాష్, రాజ్ కుమార్ సుబేదార్, ఆకుల అశోక్, శ్యామ్ అగర్వాల్, జుగల్ సోనీ, బాబురావు, పవన్ పాండే, నర్సింగ్ రావు, రామకృష్ణ, ఇన్నర్ బిల్ క్లబ్ నిజామాబాద్ అధ్యక్ష కార్యదర్శులు రూప మిట్టల్, కవిత అగర్వాల్, దర్శనా జైన్, కీర్తి సోనీ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విలీన సభ పోస్టర్ల ఆవిష్కరణ

- సభను జయప్రదం చేయాలి
- ఐఎఫ్‌టీయు జిల్లా ఉపాధ్యక్షులు

బి.సూర్య శివాజీ

నవతెలంగాణ-ఆర్మూర్



విలీన సభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తెలంగాణ రాష్ట్రంలో రెండు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను ఈనెల 28 న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నామని ఐఎఫ్‌టీయు జిల్లా ఉపాధ్యక్షులు బి.సూర్య శివాజీ గురువారం తెలిపారు. పట్టణంలో సంఘం కార్యాయలంలో న్యూ డెమోక్రసీ విలీన సభ పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సూర్య శివాజీ మాట్లాడుతూ.. భారత విప్లవోద్యమం అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నదని ఆయన తెలిపారు. మార్క్సిజం, లెనినిజం మావో ఆలోచన విధాన దృక్పథంతో 1969లో ఏర్పడిన సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, 50 ఏళ్ల తన లక్ష్యమైన నూతన ప్రజాస్వామ్య విప్లవాన్ని సాధించడంకోసం ఎన్నో పోరాటాలు నిర్వహిస్తూ, కష్టనష్టాలను భావిస్తూ, నిర్బంధాలను ఎదుర్కొని అనేకమంది వీరులను త్యాగం చేసిన చరిత్ర న్యూ డెమోక్రసీకి ఉందని ఆయన తెలిపారు. దేశంలో అనేక సమస్యలపై పోరాడి విజయం సాధించి ప్రజలను జాగృతం చేస్తుందని ఆయన తెలిపారు. ఈ క్రమంలో ఒకే సైద్ధాంతికంగా రాజకీయ విధానం కలిగిన సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ 2013 నుండి రెండు పార్టీలు విడిపోయి, 11 సంవత్సరాలుగా విడివిడిగా పనిచేశాయన్నారు. వివిధ విప్లవ గ్రూపుల ఐక్యత కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కావున ప్రజలు సంపూర్ణ మద్దతు తెలిపి, పార్టీ శ్రేణులు విలీన సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ మరియు ప్రజా సంఘాల నాయకులు గులాం, వర్ధ రెడ్డి నజీర్, ఇన్న, హుస్సేన్, షాయబ్, వాజీద్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా జక్కిడి శివ చరణ్‌రెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా జక్కిడి శివ చరణ్ రెడ్డి ఎన్నికయ్యారని నిజామాబాద్ రూరల్ యువజన విభాగం యూత్ ఉపాధ్యక్షుడు వినోద్ తెలిపారు. ఆగస్టు, సెప్టెంబర్‌లో జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో 2లక్షల 16 వేయిల 115 ఓట్ల మెజారిటీతో జక్కడి శివ శరణ్‌రెడ్డి ఘనవిజయం సాధించారన్నారు. బుధవారం సాయంత్రం ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా అధికారికంగా ప్రకటించి, నియామక పత్రాన్ని జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ ఉదయ్, భాను ఛిబ్ అందజేశారని తెలిపారు.

అటవీ సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి

నవతెలంగాణ-సిర్పూర్(టీ)

అటవీ సంరక్షణ అభివృద్ధిలో ఉద్యోగులతో పాటు ప్రజలు భాగస్వాములు కావాలని కంపా పీసీసీఎఫ్ సువర్ణ అన్నారు. సిర్పూర్-టి రేంజ్ పరిధిలోని ఇటుకల పహాడ్ గ్రామాన్ని సీఎఫ్ శాంతారాం, డీఎఫ్ఓ నీరజ్ కుమార్‌తో కలిసి సందర్శించి అక్కడ కంపా నిధులతో చేసిన ప్లాంటేషన్ పరిశీలించినంతరం గ్రామస్తులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్లాంటేషన్ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. అడవులను సంరక్షిస్తే భావితరాలకు ఎంతో గొప్ప సంపద అందించిన వారమవుతామన్నారు. ప్రజలు అటవీ అధికారులకి సహకరించాలని సూచించారు. అటవీ అభివృద్ధి కోసం చేసే ప్రతి పనిలో ప్రజలను భాగస్వాములను చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ వినయ్ కుమార్ సాహు, ఎఫ్ఆర్ఓలు ఇక్బాల్ హుస్సేన్, శశిధర్ బాబు, డీఆర్ఓ శ్రీధర చారి, ఎఫ్ఎస్ఓ మోహన్ రావ్, బీట్ అధికారి నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

త్యాగాలు, పోరాటాల చరిత్ర ఎర్రజెండాది

నవతెలంగాణ-రెబ్బెన

త్యాగాలు, పోరాటాల చరిత్ర కలిగిన సీపీఐ జెండా పట్టుకొని నిరంతరం పేద ప్రజల పక్షాన పోరాడతామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) శత ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గోలేటిలోని కేఎల్ మహేంద్ర భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్‌కట్ చేసి మాట్లాడుతూ ఈనెల 30న నల్లగొండ జిల్లాలో జరిగే పార్టీ ఆవిర్భావ ప్రారంభోత్సవ బహిరంగ సభ ర్యాలీని జయప్రదం చేయాలన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం అనునిత్యం పోరాడేది కేవలం సీపీఐ జెండా మాత్రమేనని, అలాంటి ఎర్రజెండా వంద సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి బి.జగ్గయ్య, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షులు బయ్య మొగిలి, ఆర్గనైజింగ్ కార్యదర్శిలు శేషశినారావు, జూపాక రాజేష్, కనుకుంట్ల కిరణ్ బాబు, మీస చంద్రశేఖర్, పార్టీ బెల్లంపల్లి కార్యవర్గ సభ్యులు పుట్ట శ్రీనివాస్, కాంటాక్ట్ కార్మిక గోలేటి కార్యదర్శి సల్లూరి అశోక్, సహాయ కార్యదర్శి సాగర్ గౌడ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు జాడి సాయి, ఫిట్ కార్యదర్శిలు ఎంబటి రామయ్య, కందుల మల్లేష్, మాల ఓదెలు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు ఆసక్తి

- తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభం
- జిల్లాలో 1730 ఎకరాల్లో సాగు
- మూడేళ్ల నుంచి పంట చేతికి

నవతెలంగాణ-లింగంపేట్

ఆయిల్ పంప్ పంట సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు ప్రభుత్వం ఆయిల్ పంట సాగు చేసే రైతులను ప్రోత్సహిస్తుంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందడానికి రైతులు ఆయిల్ ఫామ్ సాగును ఎంచుకున్నారు. సబ్సిడీపై మొక్కలతోపాటు డ్రిప్ ఇరిగేషన్ సిస్టం ప్రభుత్వం అందించడంతో రైతులు ఇతర పంటలకు స్వస్తి పలుకుతూ ఆయిల్ ఫామ్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

జిల్లాలో పండ్ల తోటలు కూరగాయలు తోటలు పెంప కానికి కోతుల బెడద ఉండడంతో రైతులు ఆయిల్ ఫామ్ సాగుపై ఎలాంటి బెడద లేకపోవడంతో పంట సాగు కోసం రైతులు ముందుకు వస్తున్నారు ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా ఆయిల్ పంట సాగు విస్తీర్ణం పెరిగిపోతుంది. ప్రస్తుతం జిల్లాలో 1730 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగవుతుంది. ఈ సంవత్సరం మరింత సాగు పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.



తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు

ఆయిల్ పంట సాగు చేసే రైతులు తక్కువ పెట్టుబడుతూ ఎక్కువ లాభాలు పొందుతున్నారు. ఆయిల్ ఫామ్ పంట మూడు నుంచి నాలుగు సంవత్సరాలలో చేతికి వస్తుంది ఎకరాకు పదివేల ఖర్చు కూడా ఉండదు. మూడు సంవత్సరాల నుంచి రైతులకు ప్రతి ఏటా లాభదాయకంగా దిగుబడి వస్తుంది. వరి మొక్కజొన్నతోపాటు ఇతర పంటలు సాగుచేసిన పెట్టుబడి అవసరం కానీ ఆయిల్ ఫామ్ సాగుకు పెట్టుబడి తక్కువగా ఉంటుందని రైతులు అంటున్నారు. కామారెడ్డి జిల్లాలో మాచారెడ్డి, దోమకొండ, లింగంపేట్, నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి, తాడ్వాయి, గాంధారి, రాజంపేట మండలంలో ఆయిల్ పంట సాగు చేస్తున్నారు.

సబ్సిడీపై మొక్కలు

ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలు డ్రిప్ పరికరాలు అందిస్తుంది ఎస్సీ ఎస్టీ రైతులకు 100శాతం, బీసీలకు 90 శాతం డ్రిప్ సబ్సిడీ ఇస్తున్నారు ఆయిల్ ఫామ్ మొక్క ధర 197 ఉండగా 20 రూపాయలకే రైతులకు అందిస్తున్నారు. ఎకరాకు 50 మొక్కలు నాటుతారు. ఎకరాకు గరిష్టంగా 9600 వేలు సబ్సిడీ లభిస్తుంది, అలాగే ఎరువుల యాజమాన్యం నిర్వాణ కోసం రైతుకు 4200 అందిస్తున్నారు. రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ పరికరాలు అందించడంతో పంట సాగుపై రైతులు ముందుకు వస్తున్నారు.

మూడు సంవత్సరాల నుంచి పంట చేతికి

ఆయిల్ పంట సాగు చేసే రైతులకు మూడు నాలుగు సంవత్సరాల నుంచి పంట చేతికి వస్తుంది సుమారు 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తుంది ఈ క్రమంలో మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకు రైతులకు ఎకరాకు 6 టన్నుల దిగుబడి వస్తుంది ఎనిమిదో సంవత్సరం నుంచి ఎకరాకు పదివేల టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయని జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతము ఆయిల్ ఫామ్ మార్కెట్లో టన్నుకు 20 వేల రూపాయలు పలుకుతుందన్నారు రైతులు ముందుకు వచ్చి ఆయిల్ ఫామ్ మొక్కల పెంపకంలో లాభాలు గడించాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

అంతర పంటలతో అదనపు లాభాలు..

ఆయిల్ ఫామ్‌తో పాటు ఇతర పంటలు సాగు చేసుకోవచ్చు. అంతర్ పంటలుగా కూరగాయలు, పూల మొక్కలు. మొక్కజొన్న, మిరప, పత్తి, అరటి, వేరుశనగ, కంది, జొన్న, శనిగ, పొగాకు, సోయాబీన్, పెసర, మినుము, నువ్వులతోపాటు పశుగ్రాసం పంటలు సాగు చేసుకోవచ్చు. రైతులకు రెండు రకాలుగా లాభం చేకూరుతుందన్నారు ఒకవైపు ఆయిల్ పంట మరోవైపు అంతర్ పంటలతో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చు అంటున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉద్యాన శాఖ అధికారులు ఆయిల్ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తూ ఉన్నారు. రైతులను ప్రోత్సహించేందుకు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తున్నారు

రైతులను ప్రోత్సహిస్తాం
జ్యోతి, జిల్లా ఉద్యానవ శాఖ అధికారి

ఆయిల్ పంట సాగు చేసేందుకు రైతుల ముందుకు వచ్చినట్లయితే వారిని ప్రోత్సహిస్తామని ఆమె అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై రైతులకు పరికరాలు అందిస్తున్నాయి. చీడ పురుగుల బెడద లేకుండా రైతులకు లాభాలు ఉంటాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. రైతులు ముందుకు వస్తే ప్రోత్సహిస్తాం

5 ఎకరాల్లో సాగు చేస్తున్న
వెంకట్రావు-మోతే

ఆయిల్ ఫామ్ మొక్కలు నాటి రెండు సంవత్సరాలు అవుతుంది. ఏపుగా పెరుగుతున్నాయి. ఐదు ఎకరాల్లో ఆయిల్ పంట సాగు చేస్తున్నా. అందులో అంతర్ పంటలు సాగు చేస్తున్నాను. పెట్టుబడి తక్కువే ఉద్యాన వన శాఖ అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుంది.

మిస్సింగ్ కేసు నమోదు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్



రత్నాకర్ (ఫైల్)

నగరంలోని రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మిస్సింగ్ కేసు నమోదైనట్లు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆరిఫ్ గురువారం తెలిపారు. ఎస్ఐ ఆరిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్వాల్ రత్నాకర్-17, అశోక కాంప్లెక్స్ బైపాస్ రోడ్డులో తన తల్లిదండ్రులు వాచ్మెన్ గా పనిచేస్తారు. ఈనెల 23న మధ్యాహ్నం కిరాణా షాప్ కి వెళుతున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. ఇప్పటివరకు తిరిగి రాలేదు. నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిస్తే రూరల్ ఎస్సై 8712659849, రూరల్ సౌత్ సర్కిల్ సిఐ 8712659847 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి రెండు రోజుల శిక్ష

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ జుడీషియల్ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి గట్టు గంగాధర్ గురువారం తీర్పు వెల్లడించారు.. మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లికి చెందిన మల్లెల ప్రవీణ్, పట్టణంలోని జిరాయితనగర్‌కు చెందిన ఎండి అజార్, అదిలాబాద్ జిల్లా సారంగాపూర్‌కు చెందిన డోల ప్రశాంత్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. .

కరెంట్ తీగలు తగిలి గేదెలు మృతి

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని కోర్సిని గ్రామంలో వేటగాళ్లపెట్టిన కరెంట్ వైర్లు తగిలి అదే గ్రామానికి చెందిన దనూరి ఆశన్న, భూపతి శంకర్‌కి చెందిన రెండు గేదెలు చనిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న అటవీ, విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దీనిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు ఆ కరెంట్ వైర్లుపెట్టిన వ్యక్తులు ఎవరనేది బయటకు రాలేదు. ఇదే విధంగా గత సంవత్సరం కూడా నర్మల సత్యక్క గెదె కూడా కరెంట్ షాట్ వల్ల చనిపోయింది. ఆ సమయంలో కూడా పోలీస్‌కు ఫిర్యాదు చేశారు. అయిన గుర్తించలేదు. ఇలానే ప్రతి సంవత్సరం ఈ వేటగాళు పెట్టే కరెంట్ వైర్లకు మనుషులు కూడా బలయ్యే అవకాశాలు ఉన్నాయని, ఎవరి ప్రాణాలు పోకుండా పోలీసులు వెంటనే వారిని గుర్తించి పట్టుకోని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాక్సింగ్‌తో మానసికోల్లాసం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

బాక్సింగ్‌తో మానసిక ఉల్లాసం కలుగుతుందని టౌన్ సీఐ రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం బాక్సింగ్ డేను పురస్కరించుకొని స్థానిక సర్‌సిల్క్ ఎఫ్ కాలనీలో ముత్తు మెమోరియల్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బాక్సింగ్ పోటీలలో విజయం సాధించిన వారికి అవార్డులు, బహుమతులు అందించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ బాక్సింగ్ నేర్చుకోవడం వల్ల శరీర దారుఢ్యంతో పాటు ఆత్మస్థైర్యం పెరుగుతుందని అన్నారు. ముత్తు బాక్సింగ్ క్లబ్ అధ్యక్షుడు వేముర్ల మధును సీఐ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ అసోషియేషన్ ఛైర్మన్ శివకుమార్ నాయర్, ప్రధాన కార్యదర్శి మధురై శేఖర్ మాస్టర్, కోశాధికారి రమాకాంత్ యాదవ్, ఉపాధ్యక్షుడు జయేందర్, ప్రొఫెసర్ మిస్ వాలెంటినా, నాయకులు జాకీర్, లలిత్, క్రీడాకారులు జిబ్బిబాయి, చెట్టి వెంకటేష్ పాల్గొన్నారు.

హిందీ పోస్టుకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గంటల ప్రతిపాదికన టీజీటీ హిందీ బోధనకు ఉన్న ఒక్క ఖాళీ కోసం దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందని ప్రిన్సిపల్ దుర్గం మహేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌పీటీతో పాటు పీజీ కలిగి ఉండాలని టెట్ అర్హత ఉన్నవాళ్లు ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిగతా వివరాలకు 8106512531 నెంబర్లను సంప్రదించాలన్నారు.

అయ్యప్ప ఆలయంలో మండలి పూజా సందడి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని పెద్ద వాగు ఒడ్డున గల శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం మండల పూజ శోభ సంతరించుకుంది. ఉదయం నుండి అయ్యప్ప భక్తులు స్వాములు పెద్ద ఎత్తున ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. గత వారం రోజుల నుండి మండల పూజకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 6 గంటల నుండి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శివకేశవ ఆలయం నుండి స్వాములు భక్తులు పెద్ద ఎత్తున అయ్యప్ప విగ్రహంతో నగర సంకీర్తన రూపంలో భజనలు నిర్వహిస్తూ పురవీధుల గుండా తిరిగారు. పట్టణంలోని మహిళలు మంగళ హారతులతో స్వామివారిని దర్శించుకుని తరించారు. మహా పడి పూజ సందర్భంగా ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి, సోనేరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి అన్నదాతగా ఎమ్మెల్యే దంపతులు వ్యవహరించగా, వారి కుటుంబ సభ్యులతో కలిసి వడ్డనలో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుండి భక్తులు స్వాములు వచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు నాగేశ్వర శర్మ ఉదయం నుండి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం రాత్రి మహా పడిపూజ కోదాడకు చెందిన బాణాల సాయి శర్మ స్థానిక ఆలయ పూజారి నాగేశ్వర శర్మల ఆధ్వర్యంలో జరపడంతో పాటు పడిపూజకు వచ్చిన భక్తులకు అల్పాహారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు కాంద్ర కిషన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి వెంకటగౌడ్, కోశాధికారి చంద్రమోహన్ తో పాటు గురు స్వాములు సభ్యులు నలిని మోహన్, దూడల అశోక్, మడావి శ్రీనివాస్, రాజబాబు, వినయక్, రవీందర్ రెడ్డి, బాల రాము, గాధవేని మల్లేష్ పాల్గొన్నారు.

పార్టీల విలీన సభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-రెబ్బెన

ఈనెల 28న సీపీఎంఎల్ న్యూడెమోక్రసి పార్టీల విలీన సభను హైదరాబాద్‌లో నిర్వహించడం జరుగుతుందని నాయకులు తెలిపారు. గురువారం పార్టీల వీలిన సభ పోస్టర్లను విడుదల చేశారు. దేశంలో కులం, మతం, ప్రాంతీయ తత్వాలు, ప్రజల మధ్య చీలికలు సృష్టిస్తూ దోపిడి లేని సమసమాజ స్థాపన కోసం జరగాల్సిన ఉద్యమాలను పక్కదారి పట్టించి పాలకవర్గాలు పబ్బం గడుపుకుంటున్నాయని ఆరోపించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలీన సభకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గోలేటి శ్రీనివాస్, పోచం, లింగయ్య, నాగలక్ష్మి, డి.శంకరమ్మ, భీమేష్, నరేష్, లింగయ్య, కమల, సునీత పాల్గొన్నారు.

రోడ్డుపైకి పెద్దపులి

నవతెలంగాణ-సిర్పూర్(టీ)

తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల సమీపంలో పెద్దపులి రోడ్డుపైకి వచ్చి సంచారం చేయడంతో ప్రజలు భయందోళనలకు గురవుతున్నారు. మహారాష్ట్ర అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతం అమృత్‌గూడ గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై గురువారం మధ్యాహ్న సమయంలో పెద్దపులి కలకలం సృష్టించింది. పంట పొలాల నుంచి ఒక్కసారిగా ప్రధాన రహదారిపైకి రావడంతో వాహనదారులు, చుట్టుప్రక్కల వ్యవసాయ పనులు చేసుకుంటున్న రైతులకు పెద్ద పులి వస్తున్నట్టు మిగతా రైతులకు పెద్దపులిని చూసి కేకలు వేశారు. దీంతో వాహనదారులు రైతులు అప్రపత్తమయ్యారు. ఎలాంటి సంఘటన జరగకపోవడంతో ఊపిరి పిలుచుకున్నారు. పెద్దపులి సంచరిస్తున్న ప్రాంతంలో రైతులు పులి కదిలికలను గమనిస్తూ వ్యవసాయ పనులు చేసుకోవాలని ఇరు రాష్ట్రాల అటవీశాఖ సిబ్బంది సూచించారు.

సామాజిక అంశాలపై పోలీసు కళాబృందం అవగాహన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సామాజిక అంశాలు, చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ మోసాలపై పోలీసు కళాబృంధం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. గురువారం తిర్యాణి పోలీస్ స్టేషన్ పరిధిలోని సుంగాపూర్ గ్రామంలో పోలీస్ కళాబృందం నూతన చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, సైబర్ మోసాలు, గంజాయి నివారణపై అవగాహన, సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాధవ్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, ఎవరైనా మోసపోతే 1930 నంబర్‌కి ఫిర్యాదు చేయాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దీని వల్ల గ్రామంలో ఏ సంఘటన జరిగిన వెంటనే తెలుస్తోందన్నారు. కెమెరాలు ఏర్పాటు సహకరించలని గ్రామస్తులను కోరారు. తల్లిదండ్రులు పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. యువత చేడు వ్యాసనలకు అలవాటు పడి జీవితాన్ని నశనం చేసుకోవద్దని, తల్లిదండ్రులు పర్యవేక్షించాలని సూచించారు. మంత్రాలు తంత్రాలు మూడనమ్మకాలు నమ్మవద్దని, గ్రామాల్లో ఏ సమస్య ఉన్న వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లేదా 100 నెంబర్‌కు ఫోన్ చేస్తే నిమిషాల్లో పోలీసులు తమ వద్దకు వస్తారన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పోలీస్ కళా బృందం సభ్యులు రాంచందర్, రోహిత్, చంద్రశేఖర్, రజిత, సంఘవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆలం భీంరావు, ఆత్రం అమ్మక్కల కుటుంబాలను సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించారు. గురువారం మండలంలోని మొగవెల్లి సుష్మీర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. కుటుంబాలను పరామర్శించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తన హాయంలోనే గ్రామాలు అభివృద్ధి చెందినట్టు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో గిరిజనులతో సమావేశం అయ్యారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ మాంతయ్య, మండల నాయకులు బశరథకాన్, సకారం, పుల్లూరు సతీష్, కె.శంకర్, హనుమంతు, లంగారి శ్రీనివాస్, శ్రీదేవి, అమ్మాత, కోరితె తిరుపతి పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు కృషి చేస్తా

- టీఎన్జీవోఎస్ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ

తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నిజామాబాద్ జిల్లా ఆధ్వర్యంలో గత 20 రోజులుగా వారి డిమాండ్ల సాధన కోసం ధర్నా చౌక్‌లో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు టీఎన్జీవోస్ పాల్గొని సమ్మెలో పాల్గొన్న నాయకులను, ఉద్యోగులను అభినందించి, ఉద్యమాభినందనలు తెలిపారు. అనంతరం టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. డిమాండ్ల సాధనకు ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్, టిఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. హుస్సేని సమన్వయంతో రాష్ట్ర ప్రభుత్వంతో స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు జరుపుటకు తమ వంతుగా కృషి చేస్తామని హామీ ఇస్తూ సంఘీభావం తెలిపారు. టీఎన్జీవో కేంద్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు సంజీవయ్య, టీఎన్జీవో అర్బన్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, మారుతి భీంగల్ యూనిట్ అధ్యక్షులు స్రుజన్ కుమార్, ఆర్మూర్ యూనిట్ కార్యదర్శి విశాల్, టీఎన్జీవో ముఖ్య సలహాదారులు వనమాల సుధాకర్ టిఎన్జీవో నాయకులు, ఉద్యోగులు పాల్గొని సంఘీభావం తెలిపారు.



సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతు తెలిపిన టీఎన్జీవోస్ నాయకులు

టీఎస్‌యూటీఎఫ్, టీఎన్జీవోస్ సంఘీభావం..

దీక్షలకు టీఎస్‌యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, రాజారాం, లింగన్న, బీఎస్పీ కామారెడ్డి జిల్లా ఇన్చార్జ్, అడ్వకేట్ ఈశ్వర్, గంగన్న, పాండు, టీఎన్జీవోస్ అధ్యక్షులు సుమన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ మరియు వారి కార్యవర్గం సమగ్ర శిక్ష ఉద్యోగులకు సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, మహిళా అధ్యక్షురాలు గంగామణి, నాయకులు ప్రకాష్, అప్సర్, రవి కిరణ్, జాన్ సత్యపాల్ గంగాధర్, ప్రభు, రమేష్, రాణి, సుప్రజ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఊడ్చినిరన..

నిజామాబాద్‌సిటీ: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోగల సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నిజామాబాద్ ఆధ్వర్యంలో 20వ రోజు సమ్మెలో భాగంగా ఎన్టీఆర్ చౌరస్తా నుండి పాత కలెక్టరేట్ మీదుగా రోడ్లు ఊడ్చి నిరసన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజు, భూపెందర్, ఎస్ఎస్ఏ ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్లు ఊడ్చి 17వ రోజు నిరసన

- తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలకు ఖండన
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మద్దతు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ డిమాండ్లు పరిష్కరించాలని చేస్తున్న సమ్మెలో భాగంగా 17వ రోజు గురువారం కలెక్టరేట్ ఎదుట రోడ్లు ఊడ్చి సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన తెలిపారు. టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల సదాశివ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి కిల్లి వెంకట్ రావు, మండల గౌరవ అధ్యక్షుడు ధనరాజ్,జిల్లా నాయకులు జలపతి, మధుకర్, చంద్రయ్య, రవీందర్, శంకర్, మల్లేషంలు పాల్గొని ఉద్యోగుల సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు ఖండన

ఎస్ఎస్ఏ ఉద్యోగుల నాయకత్వంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చానల్‌లో ఉపాధ్యాయ సంఘానికి తమలోని వ్యక్తిని ఆపాదించడాన్ని సంఘం జిల్లా అధ్యక్షురాలతో పాటు నాయకులు తీవ్రంగా ఖండించారు. అసత్య ఆరోపణలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రాడ్యుయేట్ స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి మద్దతు

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైస్ చేయాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మెకు సంఘీభావం తెలిపి తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో భాగంగా పని చేస్తూ 17 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు చట్టబద్ధంగా నియమించబడ్డారన్నారు. వారిని రెగ్యులరైస్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పే స్కేల్ అమలు చేయాలని లేదా ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న వసతులనైనా కల్పించాలన్నారు. వీరి న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. 2023లో ఇదే సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెను విరమింపజేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు వీరి సమస్యలను పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక, గౌరవ అధ్యక్షుడు మోహన్, జిల్లా కోశాధికారి బోయిని నాగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో శంక భీంరావు మృతి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని బంబారా గ్రామానికి చెందిన శంక భీంరావు అనారోగ్యంతో మృతిచెందాడు. గతంలో ఆయన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఐటీడీఏలో పనిచేస్తూ అక్కడి నుండి ఏటూరు నాగారంలో ప్రస్తుతం పనిచేస్తున్నారు. అనారోగ్యంతో మృతిచెందినట్టు కుటుంబసభ్యులు వెంకట్‌రావ్ తెలిపారు. ఆయన మృతిపట్ల గ్రామస్తుల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మృతి తీరనిలోటని గ్రామస్తులు అన్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే

మండలంలోని బంబారా గ్రామానికి చెందిన కినక భీంరావ్ భద్రాచలం ఏటూరు నాగారం ఐటీడీఏ ప్రాజెక్టు కార్యాలయంలో ఏపీఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన స్వగ్రామం బంబారాలో అనారోగ్యంతో మరణించడంతో ఆయన మృత దేహానికి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మీ పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆమెతో పాటు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బీఆర్ఎస్ నాయకురాలు మరుసుకోల సరస్వతి, నాయకులు అధికారులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులున్నారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ ధ్వజస్థంభ ప్రతిష్టాపన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణం ఎస్పీఎం న్యూకాలనీలోని అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం ధ్వజస్థంభ ప్రతిష్టాపన కార్య క్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం లో గత రెండు రోజుల నుండి ప్రత్యేక పూజలు నిర్వహిస్తు న్నారు గురువారం ధ్వజస్థంభం ప్రతిష్ఠించగా సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ పాల్గొని పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులతో పాటు అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.